క్లుప్తంగా

పోటీలతో సామర్థ్యాల వెలికితీత..



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

పూసపాటిరేగ: విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించడంతో వారిలో దాగి ఉన్న సామర్థ్యాలను వెలికితీయవచ్చని ఎంఈఓలు ఎ.రాజ్‌కుమార్, బి. పాపినాయుడు అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మండల స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బి. శంకరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన దాట్ల కీర్తి

విజయనగరం అర్బన్: విజయనగరం ఆర్డీఓగా దాట్ల కీర్తి శనివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆమె కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధికి రూపొందిస్తున్న ప్రణాళికల విజయవంతానికి సిబ్బంది సహకారంతో కృషి చేస్తామన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో సమావేశమై శాఖాపరమైన లక్ష్యాలను వివరించారు.

మాతా,శిశు సంరక్షణకు చర్యలు



పౌష్టికాహారంపై అవగాహన కలిగిస్తున్న సూపర్‌వైజర్ కనకమహాలక్ష్మి

విజయనగరం రూరల్: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంతో పాటు మాతా,శిశు సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కోరుకొండ ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ ఐ.కనకమహాలక్ష్మి అన్నారు. మండలంలోని సుంకరిపేట అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మహోత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

రామతీర్థంలో పవిత్రోత్సవ పూజలు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవ పూజలను అర్చకులు, వేద పండితులు శనివారం నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తర్వాత యాగశాలలో విష్వక్సేనారాధన, పంచగవ్యప్రాశన, అగ్ని మథనం, అగ్ని ప్రతిష్ఠాపన, తదితర పూజలు చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం టౌన్: వరల్డ్ బెస్ట్ టీచర్ ఇంటర్నేషనల్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎన్ నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 5న వరల్డ్ టీచర్స్ డే సందర్భంగా విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను గుర్తించి వారిని ఘనంగా సత్కరించేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 96523 47207 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అభ్యసనాభివృద్ధి మెరుగు పరుచుకోవాలి

నెల్లిమర్ల: విద్యార్థులు అభ్యాసనాభివృద్ధి మెరుగుపర్చుకోవాలని ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ సంస్థ లెక్చరర్ మాతా రామకృష్ణ సూచించారు. శనివారం ఆయన జరజాపుపేట, కొండవెలగాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలను అభ్యసనాభివృద్ధిలో (లిప్) భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బేసిక్ స్థాయిలో అభ్యాసన బాగుంటే ఆయా సబ్జెక్టుల్లో మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు.

కలం యోధుడు గుర్రం జాషువా..



మాట్లాడుతున్న అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నాల బాలకృష్ణ

విజయనగరం టౌన్: అవమానాలను దిగమింగుతూ అక్షర శరాలు సంధించిన కలం యోధుడు గుర్రం జాషువా అని అభ్యుదయ రచయితల సంఘ జిల్లా కార్యదర్శి రత్నాల బాలకృష్ణ అన్నారు. జాషువా 129వ జయంతిని స్థానిక గురజాడ స్వగృహంలో శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డీవీవీ శివరాం రోలంగి, శిరీషా రఘురామ్, బద్రి కూర్మారావు, దాసరి తిరుపతినాయుడు, మానాపురం రాజా చంద్రశేఖర్, బులుసు సరోజ, పోతన, కృష్ణాజీ, సాహితీవేత్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఇదేం రాజకీయం స్వామీ..!

- తిరుమల పవిత్రతపై చంద్రబాబు దుర్బుద్ధి రాజకీయాలు
- లడ్డూ ప్రసాదం కల్తీ అంటూ అబద్ధపు ప్రచారాలపై సర్వత్రా మండిపాటు
- చంద్రబాబుకు బుద్ధి కల్పించాలంటూ వైఎస్సార్‌సీపీ నాయకుల పూజలు



డెంకాడ: మాట్లాడుతున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ చిత్రంలో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, తదితరులు



విజయనగరం: : వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న నగర మేయర్ , నగర పార్టీ అధ్యక్షులు ,కార్పొరేటర్లు



నెల్లిమర్ల రూరల్: మొయిద వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, తదితరులు



నెల్లిమర్ల రూరల్: రామతీర్థంలో పూజలు చేస్తున్న ఎంపీపీ అంబళ్ల సుధారాణి, శ్రీరాములనాయుడు, తదితరులు

విజయనగరం: కలియుగ దైవం వేంకటేశ్వస్వామి లడ్డూ ప్రసాదంపై తప్పుడు ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు పలు ఆలయాల్లో శనివారం పూజలు చేశారు. స్వామి వారి లడ్డూ ప్రసాదానికి వినియోగించే నెయ్యిలో కల్తీ జరిగిందంటూ కూటమి ప్రభుత్వానికి నాయకత్వం చేస్తున్న చంద్రబాబు చేస్తున్న అబద్ధపు ప్రచారాలపై వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రాయశ్చిత్త పూజలు నిర్వహించారు. టీటీడీ కల్యాణ మండపం ప్రాంగణంలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, కార్పొరేటర్లు బండారు ఆనంద్, భోగాపురపు రవిచంద్ర, ఆల్తి సత్యకుమారి, దాసరి పద్మ, తదితరులు పూజలు చేశారు. భగవంతుడిపై దుష్ప్రచారాలు చేస్తున్న వారిని క్షమించి, ప్రజలందరినీ చల్లని దీవెనెలతో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఎస్.బంగారునాయుడు, నాయకులు వెంపడాపు శ్రీనివాసరావు, బొద్దూరు లక్ష్మణరావు, ఆల్తి శ్రీనివాసరావు, బుంగ భానుమూర్తి, రౌతు భాస్కరరావు, పిన్నింటి సూర్యనారాయణ, మొయిద ఆదిబాబు, రౌతు భాస్కరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు బుద్ధి ప్రసాదించాలి..

నెల్లిమర్ల రూరల్: తిరుమల శ్రీవారి లడ్డు విశిష్టతను దెబ్బతీస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆ భగవంతుడు మంచి బుద్ధిని ప్రసాదించాలని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ ఆకాంక్షించారు. మొయిద వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అట్టాడ కృష్ణ, ధవళ లక్ష్మణరావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రామతీర్థం సీతారామస్వామి దేవాలయంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పూజలు చేశారు.

సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలి

డెంకాడ: వేంకటేశ్వరస్వామి లడ్డూ తయారీలో వినియోగిస్తున్న నెయ్యి వివాదంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ వద్ద వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు గడిచినా ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైన కూటమి నాయకులు డైవర్షన్ రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పాదయాత్ర ప్రారంభానికి ముందు.. ముగింపు అనంతరం తిరుమల వెళ్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారని తెలిపారు. అలాగే సీఎం అయిన తర్వాత బ్రహ్మోత్సవాల్లో ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించిన విషయాన్ని గుర్తు చేశారు. అవన్నీ మరిచి నేడు స్వామి మీద నమ్మకం లేదంటూ తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, భోగాపురం, పూసపాటిరేగ మండలాల పార్టీ అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ, పతివాడ అప్పలనాయుడు, పార్టీ నాయకులు గదల సన్యాసినాయుడు, పిన్నింటి తమ్మునాయుడు, సారిక వైకుంఠం, పతివాడ సత్యనారాయణ, రొంగలి కనక సింహాచలం, కోరాడ కోటినాయుడు, చిక్కాల సాంబశివరావు, మహంతి జనార్దన్, పడాల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రేబిస్ వ్యాక్సిన్ వేసుకోవాలి

- డీఎంహెచ్ఓ భాస్కరరావు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: కుక్క కరిచిన వెంటనే యాంటీ రేబీస్ వ్యాక్సిన్ వేయించుకోవాలని డీఎంహెచ్ఓ ఎస్. భాస్కరరావు తెలిపారు. ప్రపంచ రేబిస్ నివారణ దినం సందర్భంగా శనివారం స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం వద్ద నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రేబిస్ ఒక వైరల్ డిసీజ్ అన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రేబిస్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ ఎన్. సూర్యనారాయణ, జిల్లా మలేరియా నివారణ అధికారి వై. మణి, డెమో వి. చిన్నతల్లి, డీపీహెచ్ఎన్ సత్యవతి పాల్గొన్నారు.

రేబిస్ వ్యాధిపై అప్రమత్తం

పెంపుడు జంతువుల నుంచి రేబిస్ వంటి వ్యాధులు సంక్రమించకుండా జంతు ప్రేమికులు, సంరక్షకులు అప్రమత్తంగా ఉండాలని, వాటికి సకాలంలో టీకాలు వేయించాలని పశు సంవర్ధకశాఖ జె.డి డాక్టర్ వైవీ రమణ అన్నారు. ప్రపంచ రేబిస్ దినం సందర్భంగా శనివారం స్థానిక బహుళార్థ పశు వైద్యశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మనకిష్టమైన జంతువుల నుంచి మనకు తెలియకుండానే రేబిస్, మెదడవాపు, బర్డ్‌ఫ్లూ, ఎబోలా, ప్లేగు, ఆంత్రాక్స్ వంటి అనేక జూనోటిక్ వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందన్నారు. సంక్రమిత వ్యాధుల బారిన పడకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు పెంపుడు జంతువులను కూడా పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం పెంపుడు జంతువులకు ఉచితంగా మందులు, వ్యాక్సిన్లు వేశారు.

శతశాతం టీకాలు వేయాలి..



వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యాధి నిరోధక అధికారి అచ్యుతకుమారి, తదితరులు

పూసపాటిరేగ: మత్స్యకార గ్రామాలలో పిల్లలు, గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించి వ్యాధి నిరోధక టీకాలు శతశాతం వేయాలని జిల్లా వ్యాధినిరోధక అధికారి అచ్యుతకుమారి అన్నారు. మండలంలోని తీరప్రాంత గ్రామాలైన తిప్పలవలస, కోనాడ గ్రామాలలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జీరో నుంచి 16 సంవత్సరాల్లోపు పిల్లలు, గర్భిణులకు క్రమపద్ధతిలో టీకాలు వేయాలని సూచించారు. అనంతరం ఎంసీపీ కార్డులు, రిజిస్టర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎడ్యుకేషన్ అధికారి రత్నకుమారి, హెల్త్ సూపర్‌వైజర్ ఉమాపతి, ఆరోగ్య సహాయకులు ఆర్‌వీ రమణ, బంగారుబాబు, బంగారమ్మ, సంధ్య, ఎంఎల్‌హెచ్‌పీలు పూర్ణిమ, సృజన, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల వెల్లువ..



చెక్కు అందుకుంటున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: పట్టణంలోని పలువురు నుంచి సేకరించిన సొమ్మును దాతల తరఫున విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు శనివారం అందజేశారు. గంటా రవి రూ.20 వేలు, జమ్ము గ్రామస్తులు రూ. 62,365, పరిణీతి శ్రీ ఎడ్యుకేషనల్ సొసైటీ రూ.50 వేలు, బాలాజీ వాకర్స్ క్లబ్ రూ.25,116, న్యూ హెచ్ఎంసీ విజయనగరం మినీట్రక్ ఓనర్స్ - వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రూ.12,000, డీవీఎస్‌పీ రామరాజు రూ.10,000, ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రూ.2 లక్షలు, అవనాపు విజయ్, భార్గవి రూ.50,000, ప్రదీప్‌నగర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ రూ.60,000 అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వరద బాధితుల కోసం ఇప్పటి వరకు రూ.7,71,916 అందజేసినట్లు అదితి వివరించారు. విశాల హృదయంతో ముందుకు వచ్చి పెద్ద మొత్తంలో విరాళాన్ని అందజేసిన దాతలను కలెక్టర్ అభినందించారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడమే లక్ష్యం

- కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మన ఇల్లు - మన గౌరవం' కార్యక్రమం ద్వారా శతశాతం ఇళ్ల నిర్మాణాలే లక్ష్యంగా ప్రతిఒక్కరూ ముందుకు రావాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. శనివారం స్థానిక ఆనందగజపతి ఆడిటోరియంలో గృహ లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గుంకలం, కొండకరకం ప్రాంతంలో ఇళ్ల పట్టాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. అయితే ఆయా స్థలాలలో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవడంలో జాప్యం చేస్తున్నారని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం 1,2 ఆప్షన్ల ద్వారా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టిందన్నారు. గుంకులాంలో 12,483 ఇళ్లు, కొండకరకం ప్రాంతంలో 2,287 ఇళ్లు నిర్మించాల్సి ఉందని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాలను ఉపేక్షించం..

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పి.నల్లనయ్య

విజయనగరం: అనధికార నిర్మాణాలు, ఆక్రమణలను ఉపేక్షించబోమని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య హెచ్చరించారు. శనివారం స్థానిక విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రణాళిక అధికారులు, కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రణాళికా కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. రహదారులపై ఇసుక, డెబ్రిస్, పిక్క వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారికి అడ్డంకులు కలిగించిన వారిపై అపరాధ రుసుం విధించాలని ఆదేశించారు. విజయనగరంలోని అన్ని బడ్డీ కొట్టులకు ఆకర్షణీయమైన పెయింట్లు దుకాణదారులే వేయించుకునేలా చైతన్యం తీసుకురావాలన్నారు. ప్రస్తుతం ఉన్న బడ్డీలను యథాతథంగా ఉంచుతూ, కొత్తగా బడ్డీలు ఏర్పాటు కాకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో ఏసీపీ అమ్మాజీరావు, టీపీఓ ఫిలిప్, టౌన్ సర్వేయర్ సింహాచలం పాల్గొన్నారు.

నగరంలో మరో అన్న క్యాంటీన్

విజయనగరం: నగరంలో త్వరలో మరో అన్న క్యాంటీన్ ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నామని కార్పొరేషన్ కమిషనర్ పి. నల్లనయ్య అన్నారు. ఈ మేరకు క్యాంటీన్ నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. ఘోషా ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న అన్న క్యాంటీన్ పనులను ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. విజయనగరంలో ఇప్పటికే రెండు అన్న క్యాంటీన్లు ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈ కె. శ్రీనివాసరావు, డీఈ రామసుబ్బారావు పాల్గొన్నారు.

నగర పంచాయతీని పరిశుభ్రంగా ఉంచండి

- కమిషనర్ కిల్లాన అప్పలరాజు



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ అప్పలరాజు

నెల్లిమర్ల: నగర పంచాయతీని పరిశుభ్రంగా ఉంచాలని కమిషనర్ కిల్లాన అప్పలరాజు సూచించారు. నగర పంచాయతీ ప్రధాన రహదారిపై జరుగుతున్న పారిశుధ్య పనులను శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కాలువల్లో పూడికలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. దోమల నివారణకు వార్డుల్లో స్ప్రేయింగ్ చేయాలని ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి. ఉమాభాస్కర్, శానిటరీ కార్యదర్శులను ఆదేశించారు. పర్యవేక్షణలో నగర పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

సీతంలో ఫ్రెషర్స్ డే వేడుకలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి

విజయనగరం అర్బన్: గాజులరేగ పరిధిలో గల సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జేఎన్‌టీయూ జీవీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీజే నాగరాజు మాట్లాడుతూ, విద్యార్థుల ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని, దాన్ని సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఇంజినీరింగ్‌లోని అన్ని ప్రోగ్రామ్స్‌కు సమాన ప్రాముఖ్యత ఉందని చెప్పారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సత్య విద్యాసంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి, డైరెక్టర్ డాక్టర్ మజ్జి.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, ప్రథమ సంవత్సర విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీలత, సత్య డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి దేవమణి , ఆర్.ఉగ్ర నరసింహం, తదితరులు పాల్గొన్నారు.

అయ్యో...రామా!



ప్రాయశ్చిత్త పూజల్లో అర్చకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చి రుత్విక్కులు

నెల్లిమర్ల రూరల్: ఉత్తరాంధ్రలోనే రామతీర్థం సీతారామస్వామి దేవస్థానానికి ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడ కొలువై ఉన్న సీతారామచంద్రస్వామిని మూడు జిల్లాల భక్తులే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు అత్యంత నమ్మకంతో విశ్వసిస్తుంటారు. ఏటా వేలాది మంది భక్తులు స్వామిని అత్యంత భక్తి శ్రద్ధలతో దర్శించుకుంటారు. ఏటా ఈ మాసంలో సీతారామస్వామి పవిత్రోత్సవాలకు దేవస్థాన సిబ్బంది, అర్చకులు విశేష ప్రాధాన్యత నిస్తూ అత్యంత వైభవంగా జరిపిస్తుంటారు. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 40 మందికి పైగా వేద రుత్విక్కులను ప్రత్యేకంగా రప్పించి నాలుగు రోజుల పాటు ప్రత్యేక హోమాలు, పారాయణాలు నిర్వహించి పవిత్రోత్సవాలను జరిపించడం ఎప్పటి నుంచో వస్తున్న సంప్రదాయం. అయితే ఈ ఏడాది జరిపించాల్సిన పవిత్రోత్సవాలకు శుక్రవారం రాత్రి అర్చకులు అంకురార్పణ కూడా చేశారు. అయితే, తిరుమల శ్రీవారి లడ్డూ అపవిత్రమైందంటూ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆధ్వర్యంలో టీడీపీ నేతలు రామతీర్థం కల్యాణ మండపం వద్ద శనివారం ప్రాయశ్చిత్త పూజలు చేపట్టారు. సదరు నేతల ఒత్తిడితో పరమ పవిత్రంగా జరిపించాల్సిన పవిత్రోత్సవాలకు ఇద్దరు ప్రధాన అర్చకులు వెళ్లాల్సి వచ్చింది. అంతే కాకుండా పవిత్రోత్సవాలు జరిపించేందుకు వచ్చిన మరో ముగ్గురు వేద రుత్విక్కులు సైతం ప్రాయశ్చిత్త పూజలకు వెళ్లారు. ఆలయంలో తొలిరోజు పవిత్రోత్సవాలు పూర్తి చేసినప్పటికీ... సీనియర్ అర్చకులు లేకుండానే... ఉన్న సిబ్బందితోనే మమ అనిపించేశారంటూ భక్త జనం ఆరోపిస్తోంది. నేతల అత్యుత్సాహంతో ఈ ఏడాది పవిత్రోత్సవాల సంప్రదాయం మరుగున పడిందంటూ విమర్శిస్తున్నారు. ఈ అంశంపై సదరు అర్చకస్వాములను వివరణ కోరగా... ప్రొటోకాల్ ప్రకారం ప్రాయశ్చిత్త పరిహార పూజలకు హాజరు కావాల్సి వచ్చిందని, ఉన్న వైదిక సిబ్బందితో ఆలయంలో తొలిరోజు పవిత్రోత్సవాలను సంప్రదాయబద్ధంగా జరిపించామని చెప్పారు.